విద్యార్థులకు బుక్స్, యూనిఫాంలు అందజేత



విద్యార్థులకు బుక్స్, యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. బుధవారం లింగంపల్లి ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, మెరుగైన విద్యాబోధన జరుగుతుందని పిల్లలను సర్కారు బడులకు పంపాలని కోరారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు రాములు, శైలజ, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జంగయ్య, అమ్మ ఆదర్శపాఠశాల అధ్యక్షురాలు విజయలక్ష్మీ, డీపీఓ మల్లీశ్వరి, నాయకులు రాజు యాదవ్, రవీందర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, దేవులపల్లి శ్రీనివాస్, అజీమ్, రవియాదవ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రీస్కూళ్లుగా..అంగన్‌వాడీ సెంటర్లు !

- మొదటివిడతగా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న కేంద్రాలకు అవకాశం
- రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రతిపాదన



ఖాజాగూడ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్ ఇదే

రాయదుర్గం: అంగన్‌వాడీ సెంటర్ల దశ తిరగనుంది. వీటిని ప్రీస్కూళ్లుగా మార్చాలనే అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దశలవారీగా ప్రీస్కూళ్లుగా మార్చడానికి తగిన మార్గదర్శకాలు విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం, నానక్‌రాంగూడలలో ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ సెంటర్లు కొనసాగుతుండగా, మిగతా చోట్ల కొన్నింటిని స్థానిక కమ్యూనిటీహాళ్లలో ఏర్పాటు చేశారు. కాగా జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో కొనసాగే వాటిని కూడా మొదటి విడతలోనే ప్రీస్కూళ్లుగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ చర్యలు తీసుకుంటే ఎంతో మేలు

- అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా మారిస్తే వీటిలో ఎల్‌కేజీ, యూకేజీ తరహాలో విద్యార్థులకు బోధన చేసే వీలు ఉంటుంది.
- దీని కోసం శిక్షణ పొందిన ఉపాధ్యాయులనే నియమించాల్సి ఉంటుంది. అలా కాకుండా ప్రస్తుతమున్న అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ అందించి, వేతనాలు పెంచి వారికే అవకాశం కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతో బాటు జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్న వాటికి కూడా అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.
- ప్రీస్కూళ్లను కొనసాగిస్తూ, అంగన్‌వాడీ సెంటర్లు కూడా కొనసాగేలా చర్యలు తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కూడా సెంటర్ ఉండేలా చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శాంటామారియా విద్యార్థుల సత్తా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కేంబ్రిడ్జి ఎగ్జామినేషన్స్‌లో సత్తా చాటారు. ఐజీసీఎస్‌ఈ (ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) పరీక్షలకు 88 మంది హాజరు కాగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ హేమ బుధవారం తెలిపారు. 67 శాతం విద్యార్థులు ఐసీఈ విశిష్ట అవార్డులు, 33 శాతం విద్యార్థులు ఐసీఈ మెరిట్ అవార్డులు సాధించినట్లు వివరించారు. తమ విద్యార్థులు సాధించిన విజయాలు వారి పట్టుదల, సంకల్పానికి నిదర్శనమన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి

పటాన్‌చెరు ఎంఈఓ పీపీ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ రాథోడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా పుస్తకాలు, యూనిఫామ్‌లు అందాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా చూడాలని ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

వర్షాకాలం ఇబ్బందులు రాకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో ఆమె బుధవారం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం నీరు వెళ్లే నాలాలో చెత్త పేరుకుపోవడంతో రోడ్లపైకి డ్రైనేజీ నీరు చేరుతుందని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్షపు నీరు సాఫీగా సాగేలా .. పనులు ప్రారంభం



రాయదుర్గంలో పాతముంబాయి జాతీయ రహదారి పక్కన మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రాయదుర్గం: చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వరద నీరు రావడం.. ఇబ్బందులు ఎదురవుతుండడంతో రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాలలో చర్యలు చేపట్టారు అధికారులు. రెండురోజుల క్రితం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శేరిలింగంపల్లిలో పర్యటించి రోడ్లపైకి వరదనీరు రాకుండా తగిన చర్యలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మ్యాన్‌హోల్స్ క్లియర్ చేసి వ్యర్థాలు, చెత్తాచెదారం లేకుండా వరద నీరంతా సాఫీగా వెళ్ళిపోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచనలపై డీఈ రమేష్, ఏఈ జగదీష్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది రాయదుర్గంలో లిడ్‌క్యాప్ నుంచి పాన్‌మక్తా వెళ్ళే రహదారి పక్కన ఉండే మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. యుద్ధ ప్రాతిపదికన అన్ని ప్రాంతాల్లో చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. బుధవారం మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్‌ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, అవసరమైన చోట కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతల రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాస్, ఈఈ రాజు, డీఈలు రమేష్, దుర్గాప్రసాద్, స్రవంతి, విశాలక్ష్మి, ఏఈలు సునీల్, జగదీష్, ప్రశాంత్, ప్రతాప్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్ స్నేహకు వినతిపత్రాన్ని అందిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ బుధవారం జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చించారు.మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను పూర్తి చేసేలా చూడాలని కోరారు. అలాగే బక్రీద్‌ను పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయించాలని కోరారు.

పిల్లలు బడికి వచ్చేలా తల్లిదండ్రులు చూడాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధా పద్మజ

ఆల్విన్‌కాలనీ: ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రాధా పద్మజ అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారమ్ ఈ సంవత్సరం నుంచి నూతనంగా నోటు పుస్తకాలు, రాగి జావ, మధ్యాహ్న భోజనం వంటివి ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దుర్గా భవాని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మనూ' పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ



రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిని సయ్యద్ సారా సుల్తానాకు బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. 'మనూ'లోని విమెన్ స్టడీస్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ పర్యవేక్షణలో 'మహిళా ప్రధాన కుటుంబాల సమస్యలు(హైదరాబాద్ నగరంలో ముస్లిమ్ మహిళల సూచనతో స్త్రీవాద విశ్లేషణ' అనే అంశంపై సారా సుల్తానా థీసిస్‌ను సమర్పించారు.

ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి మేలు



షోరూంను ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో ఈజీ గో ఈవీ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూంను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, బొబ్బ నవతా రెడ్డి, మారం వెంకట్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ కాలేజీలో కెమిస్ట్రీ సబ్జెక్టును బోధనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బిక్షపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ కెమిస్ట్రీతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు కాలేజీలో సంప్రదించాలని సూచించారు.

మసీదుబండలోని ప్రభుత్వ పాఠశాలలో ..



పాఠశాలలు ప్రారంభం



రాయదుర్గం: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు మళ్ళీ తెరుచుకున్నాయి. బుధవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కళకళలాడాయి. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను అందించారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్లేష్

పటాన్‌చెరు టౌన్: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. కార్మికుల కోసం సీఐటీయూ నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని హింజెల్ పరిశ్రమ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ నాయకులు రోషన్, మల్లేష్, చారి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ఫ్లాట్ ఫారం వైపు భారీ చెట్ల కొమ్మలను నరికివేశారు. చెట్లు మోడులు కనిపిస్తున్నాయి. ఇక నరికేసిన కొమ్మలను రోడ్డుపై వేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొమ్మలను తొలగించాలని ప్రజలు సూచిస్తున్నారు. - శేరిలింగంపల్లి





శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రుత్విక్ వర్ణం, యాజమాన్య దీక్షా స్వీకరణ, నివేదన, మంగళ శాసనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు ఈ నెల 17వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత యోగా క్యాంప్

కూకట్‌పల్లి: భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో 12 నుంచి 16వ తేదీ వరకు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్‌లోని జీహెచ్‌యంసి పార్కులో మొదలైన యోగా తరగతుల్లో యువత పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

నిజాంపేట్: నిజాంపేట్ సాయినగర్ కాలనీలోని గణేష్ టెంపుల్ వీధిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకట్లో ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మేదర వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వమే బొంగులు ఉచితంగా సరఫరా చేసి మేదర కుల వృత్తిదారులకు ఆదరణ కల్పించాలని వెదురు పారిశ్రామిక సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీనివాస్, సర్వ్ కట్టెల దుకాణదారుల సంఘం పటాన్‌చెరు అధ్యక్షుడు లోకదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ శివారులోగల రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన పటాన్‌చెరు ప్రాంత మేదరి మహేంద్ర సంఘం వెదురు బొంగు, సర్వ్ కట్టెల దుకాణదారుల సంఘం ఆత్మీయ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లోకదాస్ మాట్లాడుతూ... ప్రభుత్వం మేదర వ్యాపారులను ఆదుకోవాలన్నారు. మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర కోశాధికారి పాతకోటి ఉమా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, గౌరవ అధ్యక్షుడు నర్సింలు నాయకులు పాల్గొన్నారు.

కాలుష్యంబారిన చెరువు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల నుంచి కలుషిత జలాలు బయటకు వదులుతున్నారని స్థానికులు వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రసాయన పరిశ్రమలతో పాటు పక్కనే ట్రీట్‌మెంట్ ప్లాంటు నుంచి నీరు భారీగా బయటకు వస్తున్నాయి. ఈ నీరు ఖాజీపల్లిలోని ఖాజీ చెరువులోకి ప్రవహిస్తుంది. దీంతో సమీపంలోని చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయన్నారు. దీనికితోడు ఘాటు వాసనలు వెలువడుతున్నాయి. వర్షాకాలంలో వర్షంనీటితో కాలుష్య జలాలను బయటకు వదిలేస్తున్నారని ,పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామికవాడల ప్రజలు కోరుతున్నారు.



సీసీ రోడ్ల పనులకు నిధులు మంజూరు



సీసీ రోడ్డు వేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇంద్రహిల్స్, మహంకాళి నగర్‌లో సీసీ రోడ్లు వేయనున్న ప్రాంతాలను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణానికి 50 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని, వీటితో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వాటర్ లీకేజ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ సీసీ రోడ్డు గురించి అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో వెంకట్‌నాయక్, ఏఇ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. తహశీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తహశీల్దార్ బిక్షపతి హెచ్చరించారు.

జాతరకు రావాలంటూ ఆహ్వానం



నీలం మధుతో మత్స్య సహకార సంఘం నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామంలో ఈనెల 16న నిర్వహించనున్న గంగమ్మ జాతరకు హాజరు కావాలని కాంగ్రెస్ నేత నీలం మధును బుధవారం మత్స్య సహకార సంఘం నాయకులు ఆహ్వానించారు. వర్షాలు విస్తారంగా కురవాలని, చెరువులు నిండాలని, పంటలు బాగా పండాలని కోరుతూ గంగమ్మ జాతర నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేశ్, రాజు, సత్యనారాయణ, సాయికుమార్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మూడు బస్సులు సీజ్

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్నట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) విజయరావు అన్నారు.
బుధవారం బీరంగూడ కమాన్ సమీపంలో రవాణాశాఖ సిబ్బందితో కలిసి స్కూళ్ల బస్సుల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల బస్సుల తనిఖీలో మొత్తం ఐదు బస్సులను తనిఖీ చేశామని, అందులో మూడు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. స్కూలు బస్సులు తప్పనిసరిగా ఫిట్ నెస్ పరీక్ష చేయించుకోవాలన్నారు.